


# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

బుధవారం | 14 | అక్టోబర్ | 2026 | పేజీలు 10 | www.manamepaper.com




# బతుకమ్మ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- లైటింగ్, శానిటేషన్, భద్రతకు అత్యంత ప్రాధాన్యత
- జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఉత్సవాలు
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా
- బతుకమ్మ ఉత్సవాలపై అధికారులతో సమీక్ష

జిల్లాలో బతుకమ్మ పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలతోపాటు నగరంలో బతుకమ్మ పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు.

**కరీంనగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో ) :** మహిళాభివృద్ధి, మెప్మా, డి.ఆర్. డి.ఏ అధికారులు అంగన్వాడి సిబ్బందిని, స్వయం సహాయక సంఘాల సభ్యులను, ప్రజా ప్రతినిధులను, ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఉన్నారు. మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు శానిటేషన్, లైటింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బతుకమ్మలు నిమజ్జనం చేసే ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అక్కడ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని అన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పోలీస్, మెడికల్, యువజన క్రీడా శాఖలు సమన్వయంతో..

- మిగతా 2లో..



# మంథనిలో అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మంథని, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** మంథని ప్రాంతంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు, మంథని--రామగుండం రహదారిపై హెలిప్యాడ్ నిర్మాణ పనులు,సమీకృత డివిజన్ కార్యాలయాల భవనం,నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రామగిరి మండలంలోని..

- మిగతా 2లో..



# విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- 112 డయల్ కి తక్షణమే స్పందించాలి
- బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి
- ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ తనిఖీల్లో జిల్లా ఎస్పీ

**మనం, ముస్తాబాద్ :** విధి నిర్వహణలో జాప్యం వహిస్తే పోలీసులు కఠిన చర్యలకు భాద్యులు అవుతారని జిల్లా ఎస్పీ మహేష్. బి. గీతే ఆదేశించాడు.మంగళవారం ఆయన ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ ని ఆకస్మిక సందర్శన చేసాడు.స్టేషన్ పరిధిలో ఎవ్వరైనా అసాంఘిక కార్యకలాపాలు జరిపితే వారిపై పోలీస్ నిఘా ఉండాలని అయన అన్నాడు.సందర్శనలో భాగంగా స్టేషన్ లో ఉన్న పాత రికార్డులను పరిశీలించాడు. పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుళ్లు ఏ విధంగా విధులు నిర్వహిస్తున్నారు.

- మిగతా 2లో..

## బతుకమ్మ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి

విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, తాగునీరు తదితర వసతులు కల్పించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరంలో బతుకమ్మ ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. నిమజ్జన ప్రాంతాలైన మానేరు నది, మానకొండూర్ కొత్తపల్లి, చెరువులు, చింతకుంట, కాకతీయ కెనాల్ ప్రాంతాల్లో లైటింగ్ శానిటేషన్ సహా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. బతుకమ్మ ఉత్సవాల కోసం పలు అభివృద్ధి పనులు కూడా చేపట్టినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదు దారులకు ఏ విధంగా న్యాయం చేస్తున్నారనే దానిపై ఆరా తీశారు. 112 డయల్ కి తక్షణ స్పందన ఉండాలని అన్నాడు. గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎస్సై జ్యోతికి సూచనలు ఇచ్చాడు. పోలీస్ లకు ఎటువంటి సమస్యలు ఉన్న వాటి సాధనకు కృషి చేస్తానని ఎస్పీ అన్నాడు. ఈ తనిఖీల్లో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్ర చారి, రూరల్ సిఐ నాగేశ్వర రావు, ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్సై జ్యోతి, సిబ్బంది ఉన్నారు.

## పారదర్శకంగా భూముల రీ సర్వే పూర్తి చేయాలి




కరీంనగర్ అక్టోబర్ 13(మనం బ్యూరో )..రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ఎలాంటి పొరపాట్లకూ తావు లేకుండా, పూర్తి పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. భూభారతి ప్రక్రియలో భాగంగా భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేపై అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే కొనసాగుతున్న 70 గ్రామాల్లో అత్యంత పారదర్శకంగా నిర్దిష్ట గడువులోగా భూ సర్వే పూర్తి చేయాలని అన్నారు. భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నెంబర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డుల వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి చూడాలన్నారు. సర్వే బృందాలు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు వివాదాలు, ఇతర అంశాల్లో ఉన్నతాధికారుల ద్వారా సందేహాలు నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా సర్వే బృందాల సభ్యులకు ఆధునిక రోవర్ యంత్రాల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన వివిధ ఫారాలు, ఆన్లైన్ నమోదు దగ్గర వివరాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు షర్మిల జల కుమారి, లైసెన్సుడ్ సర్వేయర్లు, సర్వేయర్లు, తహసిల్దార్లు,డిప్యూటీ తహసిల్దార్లు, ఆర్ ఐ లు, జి పి ఓ లు పాల్గొన్నారు.



## మంథనిలో అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి

పన్నూరు క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, మరో 10 రోజుల్లోగా కాంక్రీట్ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన డిజైన్లను నాలుగు రోజుల్లోగా ఖరారు చేయాలని సూచించారు. అవసరమైన నిర్మాణ సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవడంతో పాటు, రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లు,పొదలను తొలగించే పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పనుల పురోగతికి ఆటంకంగా ఉన్న సమస్యలను ఆర్డీఓ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ వద్ద నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేస్తూ,పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. మంథని--రామగుండం రహదారిపై ఉన్న హెలిప్యాడ్ ను గోదావరి పుష్కరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రామగిరి మండలంలోని పన్నూరు క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ,ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మంథనిలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సమీకృత డివిజన్ కార్యాలయాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, మార్చి 2027 నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనులకు అవసరమైన అదనపు నిధుల ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ,నిర్దేశిత గడువులోగా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మంథని మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటికే అధిక శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేందుకు వీలుగా భవనాన్ని వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్,ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్,సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

**అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలి..**

**అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశాలు.....**

కరీంనగర్ అక్టోబర్ 13(మనం బ్యూరో )...డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో అధికారులు అన్ని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. పూర్తయిన ఇళ్ల కాలనీల్లో తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీలు, వీధి దీపాలు, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక వసతులను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి, లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి ఐడీఓసీలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పూర్తయిన తొమ్మిది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో అందుబాటులో ఉన్న వసతులను మరోసారి సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, విద్యుత్తు కనెక్షన్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, అప్రోచ్ రహదారులు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలన్నారు. ఏవైనా వసతులు కల్పించాల్సి ఉంటే వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని 11 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించి, వాటిని వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాలనీల్లో అవసరమైన అన్ని సదు-పాయాలు కల్పించి, ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి రెండో విడత ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం ద్వారా ప్రయోజనం చేకూరేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఇన్‌చార్జి సీపీఓ వీ కిషన్‌రావు, గృహ నిర్మాణ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే పోటీలకు కాకతీయ విద్యార్థి ఎంపిక...

కరీంనగర్ అక్టోబర్ 13(మనం బ్యూరో )..శ్రీలంకలో అక్టోబర్ 16, 17 తేదీలలో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలకు చెందిన కరాటే క్రీడాకారుడు కె. ఆదిత్య సాయి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీ క్రాంతి కుమార్ ఆదిత్య సాయిని అభినందించారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. క్రీడల పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఆదిత్య సాయి ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని తెలిపారు. అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటుకుని, అద్భుతమైన ప్రదర్శనతో విజయం సాధించి పాఠశాలకు, మన దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆదిత్య సాయికి శుభాకాంక్షలు తెలియజేశారు. కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ఆదిత్య సాయిని అభినందిస్తూ, పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.



## ప్రయోజిత ఫిల్మ్స్ నిర్మిస్తాం



మంథని అక్టోబర్13 (మనం న్యూస్) : ప్రజల ఆలోచనలకు తద్వారా ప్రయోజనం సమకూరే చిత్రాలను మంథని వేదికగా త్వరలో నిర్మిస్తామని షార్ట్ ఫిల్మ్ మేకర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు కొండేల మారుతిపేర్కొన్నారు. మంగళవారం మంథని విద్యార్థి యువత కార్యాలయంలో జరిగిన సాంస్కృతిక కళలుషార్ట్ ఫిల్మ్స్ ఇతివృత్తంగా గోష్ఠిని, ఫిల్మ్ సెన్సార్ బోర్డు పూర్వ సభ్యులు బోగోజు శ్రీనివాస్ సభాధ్యక్షతన విశ్లేషణ నిర్వహించారు. కళా సంఘాల సమాఖ్య అధ్యక్షులు రమణ,సాంకేతిక ప్రామాణిక నిపుణులు రమణ,షాఫి దర్శకులు నారమల్ల కృష్ణ,తదితరులు పాల్గొని స్థితి గతులు అధ్యయనం చేసారు. ఈ ప్రాదేశిక మూలాల ను వివరించిన దర్శకులు కృష్ణ ఇక్కడ అడిషన్స్ ఏర్పాటు చేయాలన్నారు.సాంకేతిక స్కిల్ ఆర్టిస్ట్ లక్ష్మణ్ తన సహాయం అందజేస్తామన్నారు. దసరా తదుపరి నిర్మాణం జరుగనున్న షార్ట్ ఫిల్మ్ లపట్ల ఆసక్తి కలిగిన వారు 93475 90795 నంబర్ లో సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమ నేపథ్యంలో గోదావరిఖని సాంస్కృతిక కళా సంఘాల సమాఖ్య అధ్యక్షులు రమణ, సాంకేతిక కళల నిపుణులు లక్ష్మణ్ లను ఈ సందర్భంగా ఘనంగాసత్కరించారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నియామకం



రాయికల్, అక్టోబర్ 13(మనం న్యూస్) : జగిత్యాల జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా రాయికల్‌కు చెందిన బన్న సంజీవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు, బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబుకు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణికి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నారపాక అశోక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, ఎస్సీ మోర్చా బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి రాజీనామా



మంథని,అక్టోబర్13 (మనం న్యూస్)ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు,మంథని నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి సాగిఅజిత్ కుమార్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి,తన పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం ఆయన ప్రెస్ నోట్ విడుదల చేశారు.గత ఐదేళ్లుగా పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా,మంథని నియోజకవర్గ ఇంచార్జ్ గా సేవలందించానని తెలిపారు.పార్టీ ప్రధాన కార్యదర్శి కీ.శే బండ సురేందర్ రెడ్డి మరణాంతరం పార్టీలో చోటు చేసుకున్న పరిణామాలు బాధించాయని పేర్కొన్నారు.రాష్ట్ర కమిటీ సమావేశం ఏర్పాటు చేయకుండా,రాష్ట్ర మహాసభ ద్వారా ఎన్నికైన రాష్ట్ర కమిటీని జాతీయ ప్రధాన కార్యదర్శి ఏకపక్షంగా రద్దు చేయడం,అడ్ హాక్ కమిటీని ఏర్పాటు చేయడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు.అంతేకాకుండా పార్టీ ఎన్నికల సమయంలో స్వలాభం కోసం బీ-ఫారాలను అమ్ముకోవడం, సింహం గుర్తుతో వ్యాపారం చేయడం వల్ల తెలంగాణ ప్రజల్లో చెడ్డ ముద్ర పడిందని ఆరోపించారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన పార్టీ నేడు స్వార్థపరుల చేతిలో చిక్కిందని ఆవేదన వ్యక్తం చేస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

# సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాటమే లక్ష్యం



రామగిరి, అక్టోబర్ 13 (మనం న్యూస్):సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి స్పష్టం చేశారు. ఆర్జీ-3 పరిధిలోని ఏఎల్‌పీ గనిలో బుధవారం గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు మద్దతుగా నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ షిఫ్టులకు చెందిన 150 మంది కార్మికులు టీబీజీకేఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ.. వారసత్వ ఉద్యోగాలు, మెడికల్ బోర్డు విధానాల రద్దుకు ఐదు జాతీయ కార్మిక సంఘాలే ప్రధాన కారణమని ఆరోపించారు. 1998 జూన్ 6న జరిగిన ఎన్‌సీడబ్ల్యూఏ ఒప్పందంపై ఆయా సంఘాలు సంతకాలు చేయడం వల్లే కార్మికులు వారసత్వ ఉద్యోగ హక్కును కోల్పోయారని విమర్శించారు. ప్రస్తుతం వేజ్‌బోర్డు, ఎన్‌సీడబ్ల్యూఏ ఒప్పందాల ద్వారా కార్మికులకు ప్రయోజనాలు కల్పిస్తున్నామని చెప్పుకునే సంఘాలు గతంలో జరిగిన పరిణామాలపై సమాధానం చెప్పాలని అన్నారు.ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. ఆర్జీ ఓసీ-1లో గతంలో మట్టి తొలగింపు పనుల్లో 50 నుంచి 60 శాతం వరకు సింగరేణి కార్మికులే పాల్గొనేవారని, ప్రస్తుతం ఆ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించి కార్మికులను బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది ప్రైవేటీకరణ దిశగా సాగుతున్న చర్యగా అభివర్ణిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విభాగాలు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.హక్కుల్ని కార్మిక సంఘాలు సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా కార్మికులపై ఒత్తిళ్లు పెంచుతున్నాయని, సెక్షన్ల మార్పులు, బెదిరింపులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ ప్రకటించిన మేనిఫెస్టోల్లోని డిమాండ్లు దాదాపు ఒకే విధంగా ఉన్నాయని పేర్కొంటూ, 24 డిమాండ్లపై ఒప్పందం జరిగిందని చెబుతున్న నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఆ ఒప్పందాన్ని డీవైసీఎల్‌సీ, కార్మిక శాఖ వద్ద అధికారికంగా ఎందుకు నమోదు చేయలేదని నిలదీశారు.యాజమాన్యంతో సమ్మె చేయబోమని ఒప్పందం చేసుకోవడం కార్మికుల పోరాట స్ఫూర్తిని బలహీనపరిచిందని రాజిరెడ్డి ఆరోపించారు. గతంలో వారసత్వ ఉద్యోగాల విషయంలో కార్మికులకు నష్టం జరిగిందని, ప్రస్తుతం కూడా వారి హక్కులకు భంగం కలిగే పరిస్థితులు ఉన్నాయని అన్నారు.లాభాల వాటాను వెంటనే ప్రకటించాలి.సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటాపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమని రాజిరెడ్డి అన్నారు. గతంలో జూన్, జూలై నెలల్లోనే వాస్తవ లాభాలను ప్రకటించి, సెప్టెంబర్ నాటికి లాభాల వాటాను ఖరారు చేసేవారని పేర్కొన్నారు. ఈసారి దసరా సమీపించినా లాభాల శాతాన్ని ప్రకటించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వం కార్మికుల లాభాల వాటాను 16 శాతం నుంచి 32 శాతానికి పెంచిందని గుర్తుచేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం కూడా కార్మికులకు న్యాయమైన వాటాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.కార్మిక గర్జన సభను విజయవంతం చేయాలి.కార్మిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.టీబీజీకేఎస్‌లో 150 మంది కార్మికుల చేరికఆర్జీ-3 ఏపీఏ ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య, ఏఎల్‌పీ ఫిట్ సెక్రటరీ వీవీ గౌడ్ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల ఫ్రీ షిఫ్ట్, 7 గంటల షిఫ్టులలో గేట్ మీటింగ్ నిర్వహించారు. బ్రాంచ్ సెక్రటరీ తిప్పారపు తేజ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఫ్రీ షిఫ్ట్ నుంచి 70 మంది, 7 గంటల షిఫ్ట్ నుంచి 80 మంది కలిపి మొత్తం 150 మంది కార్మికులు టీబీజీకేఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా సాత్విక్, సతీష్ కుమార్, మహేష్, తిరుపతి, హుస్సేన్, సంపత్ కుమార్, సదన్, నరేష్, మహేందర్, సాయి, రామకృష్ణ, రాజేందర్, ఫయాజ్, శ్రవణ్, అవినాష్, మల్లేష్, సంతోష్, శంకర్, అరవింద్, వెంకన్న, రాజ్ కుమార్, వేణుగోపాల్, రాజేష్, ఆకాష్, శ్రీధర్, శివ, చిరంజీవి, ప్రశాంత్, విజయ్, శ్రీనివాస్, ఉపేందర్, సంపత్, శ్రీకాంత్, జక్సన్, కిరణ్, రమేష్, వీరయ్య తదితరులకు మిర్యాల రాజిరెడ్డి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పింగిలి సంపత్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ దేవ శ్రీనివాస్, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈసంపల్లి రమేష్, సెంట్రల్ కమిటీ సభ్యుడు గట్టు శ్రీను, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కొప్పుల సురేష్, పూసల శేఖర్, గోరె క్రాంతి, దొరగొళ్ల రాజేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పెరుక రమేష్, తమనేని వెంకటేష్, రాజేష్, చిరంజీవి, మధు, కిరణ్, వేదవ్యాస్, సతీష్, ఆనంద్, రామరాజు, శ్రీనివాస్, నరేష్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెమల్ల అబ్బయ్య, కమిటీ సభ్యులు మండమరి రమేష్, హుస్సేన్, మహేష్, తిరుపతి కుమార్, సదన్, రవి, శ్రీకాంత్, నరేష్, అనిల్ పాల్గొన్నారు.

## మంథని మండలంలో ఎల్ఎస్ఆర్ సీడ్స్ "ఫిదా"పత్తి క్షేత్ర ప్రదర్శన




మంథని,అక్టోబర్13 (మనం న్యూస్) మంథని మండలం విలోచవరం గ్రామంలో ఎల్ఎస్ఆర్ సీడ్స్ ఆధ్వర్యంలో "ఫిదా బీజీ-2" పత్తి రకం క్షేత్రస్థాయి ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు కొరవైన సమ్మయ్యకు చెందిన పత్తి చేనులో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సమ్మయ్య ఫిదా బీజీ-2 రకాన్ని సాగు చేయగా,పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడిని ఇవ్వడం పట్ల చుట్టుపక్కల 8 గ్రామాల నుండి సుమారు109 మంది రైతులు క్షేత్రాన్ని సందర్శించి సాగు విధానాన్ని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కంపెనీ ఆర్ఎస్ఎం నాంపల్లి తిరుపతిమాట్లాడుతూ"ఫిదా బీజీ-2 రకం బరువైన పెద్ద కాయలు, ఎక్కువ కొమ్మలతో అధిక దిగుబడిని ఇస్తుంది.చీడపీడలను తట్టుకునే సామర్థ్యం ఎక్కువగా ఉండి రైతులకు లాభదాయకంగా ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్స్ పవన్ సాయి ఫెర్టిలైజర్స్, డీలర్లు శ్రీ రామా ఫెర్టిలైజర్స్, మార్కండేయ ఫెర్టిలైజర్స్ ప్రతినిధులు,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# కొత్తగట్టులో దీక్ష శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎంపీ వినోద్ కుమార్

శంకరపట్నం అక్టోబర్ 13 (మనం న్యూస్) : కొత్తగట్టు గొల్లపల్లి గ్రామస్తుల న్యాయమైన కోర్కెను తీర్చి ఆ రెండు గ్రామాల ప్రజల కష్టాలను కేంద్ర ప్రభుత్వం తీర్చాలని కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బోయినపల్లి వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు టోల్ ప్లాజా వద్ద కొత్తగట్టు గొల్లపల్లి గ్రామస్తుల నిరాహార దీక్ష శిబిరాన్ని వినోద్ కుమార్ సందర్శించి మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో ఏర్పాటు చేయాల్సిన అండర్ పాస్ ఏర్పాటు చేయకపోవడంతో కొత్తగట్టు, గొల్లపల్లి గ్రామాలు 4 గ్రామాలుగా విడిపోయి రాకపోకల కోసం రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు కష్టాలు పడుతున్నారని, శాంతియుతంగా అండర్ పాస్ నిర్మాణం చేయాలని దీక్ష చేపట్టారని పేర్కొన్నారు. జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ను బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కలిసి కొత్తగట్టు గొల్లపల్లి గ్రామ ప్రజల కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వినోద్ కుమార్ వెల్లడించారు. సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని, గ్రామస్తులు దీక్ష విరమించి అధికారుల బాట బాట పట్టి అండర్ పాస్ సాధించుకుందామని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి



కౌశిక్ రెడ్డి, కొత్తగట్టు గ్రామ సర్పంచ్ మాడ సుజాత రాజిరెడ్డి, గొల్లపల్లి గ్రామ సర్పంచ్ మాదారపు విద్యాసాగర్ రావు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గంట మహిపాల్, మాజీ జెడ్పిటిసిలు శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, శేఖర్ గౌడ్, మాజీ సర్పంచులు కిషన్ రావు, తిరుపతి, విజయకుమార్ రెడ్డి, కొత్తగట్టు మత్స్య గిరింద్ర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ శ్యామ్ రావు, మలహల్ రావు ,నల్ల మల్లారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కొత్తగట్టు, గొల్లపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి జన్మదిన వేడుకలు

జమ్మికుంట, అక్టోబర్ 13 (మనం న్యూస్): తెలంగాణ శాసనసభ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధు-సూదనాచారి జన్మదిన వేడుకలను మంగళవారం జమ్మికుంట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కాటిపల్లి రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న వారికి పండ్లను పంపిణీ చేశారు. జమ్మికుంట పట్టణంలోని (బొమ్మలగుడి) శివాలయంలో కాటిపల్లి సృష్టిసాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని చాటిచెప్పారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మిక చింతనను, మానవత్వాన్ని పెంపొందిస్తాయని




పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కాటిపల్లి రాజు, సృష్టిసాయి మాట్లాడుతూ... మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆ పరమశివుడి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరెన్నో సేవలందిస్తూ ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.

# మంథని జేఎన్‌టీయూలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

రామగిరి, అక్టోబర్ 13 (మనం న్యూస్): మంథనిలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలు, నృత్యాలతో విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు సందడి చేశారు. కళాశాల ఆవరణలో ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది.కళాశాలలోని ఆరు బ్రాంచ్‌ల విద్యార్థులు పోటీపడి వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మలను పేర్చారు. అనంతరం బతుకమ్మలను ర్యాలీగా తీసుకెళ్లి సంప్రదాయ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.ఈ



కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ఎం. ఉదయ్‌కుమార్, ఆరు బ్రాంచ్‌ల విద్యార్థులు, ఉద్యోగులు, హౌస్‌కీపింగ్ సిబ్బంది, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సెయింట్ జోసెఫ్ చర్చి నూతన కమిటీ ఎన్నిక



మంథని,అక్టోబర్13 (మనం న్యూస్) పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలోని సెయింట్ జోసెఫ్ చర్చి (ఆర్ సీ ఎం)నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జంజర్ల లింగయ్య,ఉపాధ్యక్షులుగా కాంట్రక్టర్ ఇజ్రాయేల్,ప్రధాన కార్యదర్శిగా నామని తాతరావు,సంయుక్త కార్యదర్శిగాచిట్టూరిమూర్తి,కోశాధికారిగా మేకలపద్మ,సహ కార్యవర్గం డాక్టర్ ధన్యాకుమారి, జంజర్ల రాజ్యలక్ష్మి, గౌరవసలహాదారులుగా డాక్టర్ శౌరి రెడ్డి,సుని సిస్టర్, మినీసిస్టర్ లు ఎన్నికైయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ చర్చి అభివృద్ధికి, విశ్వాసుల ఆధ్యాత్మిక శ్రేయస్సుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ నవీన్ కుమార్,మేకల మల్లేశం,శంకర్, వెంకటరమణ, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# దుర్గాదేవి పూజలో పాల్గొన్న జీవన్ రెడ్డి



రాయికల్, అక్టోబర్ 13 (మనం న్యూస్) : రాయికల్ మండలంలోని మైతాపూర్, వీరాపూర్, రామాజీపేట, మూటపల్లి గ్రామాలతో పాటు రాయికల్ పట్టణంలో నిర్వహించిన దుర్గాదేవి అమ్మవారి ఉత్సవాల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్టియు టిఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయండి

రాయికల్, అక్టోబర్ 13 (మనం న్యూస్) : ఈ నెల 15, 16 తేదీల్లో నల్గొండ జిల్లా గంధంవారిగూడెం రోడ్డులోని జి.ఎం. గార్డెన్‌లో నిర్వహించనున్న పి.ఆర్.టి.యు.టి.ఎస్. 6వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంభాల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో 2026--28 సంవత్సరాలకు సంబంధించి రాష్ట్ర సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడంతో



పాటు పలు కీలక తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ, పెండింగ్ డీఏలు, పదవీ విరమణ బకాయిల చెల్లింపు, నూతన ఆరోగ్య పథకం అమలు, సీపీఎస్ రద్దు, సర్వీస్ రూల్స్ అమలు తదితర సమస్యల పరిష్కారానికి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సమావేశాలకు ఉపాధ్యాయులంతా ఐక్యంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ముల్కనూర్ సర్పంచ్ ఇంటి ఎదుట మృతదేహంతో పెద్ద ఎత్తున ధర్నా

**సర్పంచ్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపణ..**

**ముల్కనూర్‌లో ఉద్రిక్తత,రంగంలోకి దిగిన పోలీస్ బాలాగాలు**

**రమేష్ కుటుంబానికి న్యాయం చేస్తామని ఏసీపీ విజయ్ కుమార్ హామీతో విరమణ...**



చిగురుమామిడి: అక్టోబర్ 13 (మనం న్యూస్) : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామంలో మంగళవారం ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఈ నెల 6న గ్రామంలో స్ట్రీట్ లైట్ రిపేర్ చేస్తూ విద్యుత్ షాక్‌కు గురైన ప్రైవేట్ ఎలక్ట్రిషన్ కత్తెరమల్ల రమేష్ (31), తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.రమేష్ మృతికి గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ, ఆమె భర్త కొమురయ్యలే కారణమంటూ మృతుడి బంధువులు,కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు.తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మాల సంఘం నాయకులతో కలిసి కుటుంబ సభ్యులు మృతదేహంతో సర్పంచ్ ఇంటి ఎదుట పెద్ద ఎత్తున తరలివచ్చి ఆందోళనకు దిగారు.గ్రామంలో వందలాది మంది పోలీసు బందోబస్తు ఉన్నప్పటికీ మాస్టర్ ప్లాన్ తో బాధితులు ఇండ్ల మధ్య దారులగుండా మృతదేహాన్ని సర్పంచ్ ఇంటి ముందుకు తీసుకురావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసు బలాగాలు చిన్న ముల్కనూర్ గ్రామాన్ని చుట్టుముట్టాయి.విషయం తెలుసుకున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు.చట్ట ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని,రమేష్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించి ధర్నాను విరమించారు.శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా కొత్తపల్లి సీఐ బిల్లా కోటేశ్వర్,చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ తదితరులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.మృతదేహాన్ని సర్పంచ్ ఇంటి దగ్గర నుండి తీసుకెళ్లడంతో పోలీసులు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ ధర్నాలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య,పుష్ప,గంట రేణిక,కాడే శంకర్,ఎలుక దేవయ్య, జంగం చంద్రశేఖర్,రుద్రపట్ల చిన్న,ఎర్రోళ్ల కవిత,అరె కిషోర్,లింగం కుమార్,ఎలుక రాజు,మారెళ్ళ మహేష్,కత్తెర మల్ల అంజయ్య,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ధర్నాలు చేపట్టి ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదు

**-హుజురాబాద్ ఏసీపీ వాసంశెట్టి మాధవి...**



హుజురాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్): సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ చట్టబద్ధమైన మార్గాలను అనుసరించాలని, జాతీయ రహదారులపై ధర్నాలు నిర్వహించి ప్రజా రవాణాకు అంతరాయం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హుజురాబాద్ ఏసీపీ వాసంశెట్టి మాధవి హెచ్చరించారు. హుజురాబాద్ ఏసీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... హుజురాబాద్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు సమగ్రంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. ప్రతి కేసులో ఆధారాలు సేకరించి చట్టప్రకారం విచారణ పూర్తి చేయడానికి కొంత సమయం పడుతుందని, ఫిర్యాదుదారులు పోలీసులపై నమ్మకం ఉంచి దర్యాప్తునకు సహకరించాలని కోరారు. ఇటీవల సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన బజ్జూరి తిరుమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సంబంధిత వ్యక్తిని విచారించి వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి పంపినట్లు తెలిపారు.

**జాతీయ రహదారిపై ఆందోళనతో మరో కేసు...**

బజ్జూరి తిరుమలకు అన్యాయం జరిగిందంటూ ఈ నెల 11న చల్లూరి కోమల, మొలుగూరి లక్ష్మి మరికొందరు మహిళలతో కలిసి ఏసీపీ కార్యాలయానికి వచ్చారని, ఆ సమయంలో ఏసిపి అందుబాటులో లేకపోవడంతో జాతీయ రహదారిపైకి వెళ్లి సుమారు 30 నిమిషాల పాటు ధర్నా చేయడంతో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దీంతో హుజురాబాద్ పి.ఎస్ లో కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

**పునరావృతమైతే కఠిన చర్యలు...**

సదరు వ్యక్తులు గతంలో బోర్నపల్లి గ్రామంలో కూడా ఇదే రీతిలో ధర్నా చేశారని, అప్పట్లో హెచ్చరించి వదిలేసినప్పటికీ మళ్లీ రస్తారోకోకు దిగడంతో ఈసారి కేసు నమోదు చేశామని ఏసీపీ తెలిపారు. అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే రోగులు, విద్యార్థులు, ఉద్యోగుల ప్రయాణాలకు ఆటంకం కలిగించడం సమంజసం కాదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

**ఫిర్యాదుల సమర్పణపై ఏసీపీ సూచనలు...**

పోలీస్ అధికారులపై లేదా దర్యాప్తుపై ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించే శ్రేణి విధానాన్ని ఏసీపీ వివరించారు.

మొదటి స్థాయిలో ఎస్ఐ/ ఐఓపై ఫిర్యాదులు ఉంటే సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) కి విన్నవించాలని అన్నారు.

రెండవ స్థాయిలో సర్కిల్ ఇన్స్పెక్టర్ పై ఫిర్యాదు ఉంటే డివిజనల్ ఏసీపీ కి విన్నవించాలని అన్నారు.

ఉన్నత స్థాయిలో ఇతర పోలీస్ అధికారులపై అభియోగాలు ఉంటే పోలీస్ కమిషనర్ (సిపి) దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

# ముదిమాణిక్యంలో విషాదం

**గుండెపోటుతో యువకుడి అకాల మరణం**

**ఇద్దరు పసిపిల్లలను వదిలి అనంతలోకాలకు..**

**బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలఅంటున్న గ్రామస్తులు**



చిగురుమామిడి అక్టోబర్ 13 (మనం న్యూస్) : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జెరిపోతుల కుమార్ (34), బతుకుదెరువు నిమిత్తం కరీంనగర్ లో ఎలక్ట్రిషన్ కూలీగా జీవనం సాగిస్తున్న య-ువకుడు గుండెపోటుతో అకాల మరణం చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమార్ హఠాత్తుగా తీవ్రమైన గుండెనొప్పికి గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే సోమవారం రాత్రి, చికిత్స నిమిత్తం హాస్పిటల్లో చేర్చగా, మంగళవారం 1:30 ఉదయం హాస్పిటల్ డాక్టర్స్, ప్రయత్నం చేసినప్పటికీ, ఆస్పత్రిలో నే ఆయన కన్నుమూశారు. ఎల్లప్పుడూ అందరితో కలుపుగోలుగా ఉండే కుమార్ మరణాన్ని ఆయన స్నేహితులు, గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు.

**దిక్కుతోచని స్థితిలో పసిపిల్లలు**

కుమార్ అకాల మరణంతో ఆయన కుటుంబం పూర్తిగా వీధిన పడింది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పసిపిల్లలు ఉన్నారు. ఒక కుమార్తె (వయసు 4 సంవత్సరాలు), ఒక కుమారుడు (వయసు 2 సంవత్సరాలు) ఉన్నారు. నాన్న అంటే ఏమిటో కూడా తెలియని వయసులోనే తండ్రిని కోల్పోయి ఆ పిల్లలు అనాథలయ్యారు. కుటుంబానికి ఏకైక ఆధారమైన కుమార్ మరణించడంతో, ఆ పసిపిల్లల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. భర్త శవంపై పడి భార్య, పిల్లలు ఏడుస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

**ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి**

కుటుంబాన్ని సాకే వ్యక్తిని కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సదరు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామ-స్థులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, అలాగే ఆ పసిపిల్లల చదువుకు, కుటుంబానికి అన్ని విధాలా తోడ్పాటు అందించాలని గ్రామస్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# అనిల్ కుమార్ స్మారకంగా కమాన్ ప్రారంభం




రామగిరి, అక్టోబర్ 13 (మనం న్యూస్): రామగిరిమండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన బొంకూరి ఓదమ్మ--పోచం కుమారుడు, కీర్తిశేషులు బొంకూరి అనిల్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన స్మారకార్థం అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన కమాన్ ను మంగళవారం గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె కమాన్‌ను ప్రారంభించి అనిల్ కుమార్ జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనిల్ కుమార్ స్మారకంగా ఏర్పాటు చేసిన కమాన్ ఆయనను ఎప్పటికీ గుర్తుచేసుకునేలా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్యాల పద్మ, కొయ్యడ పద్మ, రోడ్డ విజయ్, రేండ్ల కుమారస్వామి, కొట్టె నాగరాజు,వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు అంబేద్కర్ నగర్ కాలనీవాసులు, గ్రామ ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దసరా సెలవులకు ఊర్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి..!



గంగాధర, అక్టోబర్ 14, ( మనం న్యూస్ ):దసరా సెలవుల సందర్భంగా చాలా మంది కుటుంబాలతో కలిసి స్వగ్రామాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉన్నందున, ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గంగాధర ఎస్ ఐ. బి. వంశీకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇంటి ప్రధాన ద్వారాలు, కిటికీలు, వెనుక ద్వారాలకు పటిష్టమైన తాళాలు వేయాలని, ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు వంటి విలువైన వస్తువులను సాధ్యమైనంత వరకు ఇంట్లో ఉంచకూడదని బ్యాంకు లాకర్లలో భద్రపరచు కోవాలని అన్నారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో బహిరంగంగా తెలియ జేయకూడదనీ, ఇంటి పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే గమనించి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసి, ఇంటి పరిసరాలను గమనిస్తూ ఉండాలని కోరాలని, వీలైతే ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటి బయట తాళాలు స్పష్టంగా కనిపించే విధంగా ఉంచకుండా, ఇంట్లో ఎవరూ లేరనే విషయం ఇతరులకు సులభంగా తెలియకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం అందించడం ద్వారా అనుమానాస్పద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండేందుకు సహకరించాలని, ఏదైనా అనుమానాస్పద ఘటన లేదా దొంగతనం జరిగినట్లు గుర్తించిన వెంటనే డయల్ 100 లేదా 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# భూ భారతి రీ సర్వేతో సమస్యలు పరిష్కారం..!

గంగాధర, అక్టోబర్ 13, ( మనం న్యూస్ ) : భూ భారతి రీ సర్వే ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రతీ భూమి హద్దును నిర్ధారించడంతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గంగాధర తహసిల్దార్ అంబటి రజిత తెలిపారు. మంగళవారం గంగాధర మండలం నాగిరెడ్డి పూర్ గ్రామంలో భూభారతి రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ వారం రోజుల్లో గ్రామంలో భూభారతి రీ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సమగ్ర రీసర్వే నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. భూముల హద్దులు, రికార్డులలో మార్పులతో సమస్యలు వచ్చాయని, పట్టాదారు పాస్‌పుస్తకాల్లో మార్పు జరిగినప్పటికీ క్షేత్రస్థాయిలో భూమికి సంబంధించిన మ్యాప్ అందుబాటులో లేకపోవడం వల్ల భూముల విస్తీర్ణంలో తేడాలు, హద్దులకు సంబంధించిన సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతీ భూమిని క్షేత్రస్థాయిలో సర్వే చేసి హద్దులను నిర్ధారిస్తామని చెప్పారు. భూ వివరాలపై ప్రజలకు 21 రోజుల గడువు ఇస్తామని, అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులను జారీ చేస్తామని తెలిపారు. సర్వే సమయంలో రైతులు భూముల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గునుగొండ యశోద బాబు, గ్రామ కార్యదర్శి, గ్రామపంచాయతీ పాలక వర్గం, రెవెన్యూ సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.



# రోడ్డును బాగు చేయాలని తహసీల్దార్ విజ్ఞప్తి



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 13 (మనం న్యూస్): ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పెద్ద చెరువు సమీపంలో ఉన్న ముత్యాల పోచమ్మ ఆలయ కట్టకింది రహదారి సరిగా లేకపోవడంతో రైతులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఇదే రహదారిపై మొక్కజొన్న ధాన్యాన్ని తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన రైతు, ట్రాక్టర్ యజమాని పుస్తెం చిన్న భూమన్న, మరో రైతు ఓజ్జెల చిన్నయ్యకు చెందిన మొక్కజొన్న ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తూ, పెద్ద చెరువు సమీపంలోని ముత్యాల పోచమ్మ ఆలయం వద్ద ఉన్న కల్లంలో ఆరబెట్టేందుకు కట్టకింది రహదారి మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో రహదారి సరిగా లేకపోవడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ముత్యాల పోచమ్మ ఆలయానికి ఇబ్రహీంపట్నం గ్రామంతో పాటు వివిధ మండలాల నుండి ఆది, బుధ వారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తమ వాహనాలలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. అయితే ఆలయ కట్టకింది రహదారి ఇరుకుగా ఉండటంతో పాటు సరిగ్గా లేకపోవడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రహదారి సమస్యను ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు గుర్తించి పరిష్కరించాలని రైతులు పుస్తెం చిన్న భూమన్న, ఓజ్జెల చిన్నయ్య,పడాల రాజేందర్, మగ్గిడి నంద కిషోర్, తీగల శ్రీధర్ రెడ్డి, పుస్తెం రాజారెడ్డి, కంతి శేఖర్, పాశం శ్రీకాంత్,చిట్యాల నరేందర్, జంగిలి నిఖిల్, జంగిలి నితిన్,నరుకుల హరీష్, పత్తిరెడ్డి అవనీష్, ముక్కెర గోపాల్, చిట్యాల జలెందేర్, చిట్యాల రవి, పుస్తెం రమేష్, పుస్తెం మహేందర్, కచ్చకాయల ప్రవీణ్,కచ్చకాయల సురేష్ పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

# దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా కాల్వ శ్రీరాంపూర్‌లో అన్నదాన కార్యక్రమాలు



మనం న్యూస్, కాల్వ శ్రీరాంపూర్ : దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కాల్వ శ్రీరాంపూర్ గ్రామంలోని మూడు ప్రధాన ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు గ్రామంలోని శివాలయం రామాలయం, హరిహర క్షేత్రం లో నిత్య అన్నదానం జరుగుతోంది. భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

**హరిహర క్షేత్రంలో నిత్య అన్నదానం**

హరిహర క్షేత్రంలో నవరాత్రుల తొమ్మిది రోజులు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఇమ్మడి శ్రీను తెలిపారు. భక్తుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నామని, భక్తులందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బంగారి రమేష్, ఉప సర్పంచ్ గోలి సుధాకర్, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు హాజరయ్యారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఏటా ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా...పోలీస్ క్రికెట్ లీగ్ ప్రారంభం



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 13 (మనం న్యూస్ ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని యువతను మత్తు పదార్థాలకు దూరం చేయాలనే సత్సంకల్పంతో ఇబ్రహీంపట్నంలో క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. జగిత్యాల్ ఎస్పీ అశోక్ కుమార్,ఐపీఎస్ మెట్పల్లి డీఎస్పీ ఏ. రాములు, సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. సురేష్ బాబు ఆలోచనల మేరకు, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మండల యువత కోసం ప్రత్యేకంగా "ఇబ్రహీంపట్నం పోలీస్ క్రికెట్ లీగ్"ను ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంట్‌ను ఇబ్రహీంపట్నం ఎస్సై +. నవీన్ కుమార్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత క్రీడల ద్వారా శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, యువతతో మమేకం అయ్యేందుకు ఈ టోర్నమెంట్‌లో ఇబ్రహీంపట్నం పోలీస్ సిబ్బంది కూడా స్వయంగా ఆడనున్నట్లు ఎస్సై తెలిపారు. స్థానిక పోలీస్ సిబ్బంది, యువకులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# మెదక్‌లో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ విధ్వంసాన్ని తీవ్రంగా ఖండించిన పెద్దపల్లి జిల్లా రజక సంఘం

పెద్దపల్లి అక్టోబర్ 13 మనం న్యూస్ : పెద్దపల్లి: మెదక్ నగరంలో తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ విగ్రహంపై జరిగిన విధ్వంస ఘటనను పెద్దపల్లి జిల్లా రజక సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ బొడ్డుపల్లి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రమేష్ బొడ్డుపల్లి మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట స్ఫూర్తికి, మహిళా ధైర్యానికి, బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అటువంటి మహనీయురాలి విగ్రహాన్ని ధ్వంసం చేయడం సమాజాన్ని బాధించే చర్య అని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విగ్రహ విధ్వంస ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహాలకు తగిన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టాలి. ధ్వంసమైన విగ్రహాన్ని ప్రభుత్వ సహకారంతో పునఃప్రతిష్ఠించి, ఆ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు చేయాలి. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రజల్లో సామాజిక సామరస్యం, పరస్పర గౌరవంపై అవగాహన కల్పించాలి. వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను, పోరాట స్ఫూర్తిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత సమాజానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు అంజి బాబు, కుమారస్వామి, నవీన్ కుమార్, మెడిక సంపత్, బ్యాంక్ సురేష్, రమేష్, రవి కుమార్ తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియచేశారు.

# ఎన్‌సిఈఆర్‌టి శిక్షణకు ఎంపికైన గాజుల బాలకృష్ణ

**-డిజిటల్ విద్యలో నైపుణ్యాభివృద్ధికి గంగాధర ఉపాధ్యాయుడికి జాతీయ స్థాయి శిక్షణ అవకాశం**



గంగాధర, అక్టోబర్ 13, ( మనం న్యూస్ ):గంగాధర మండలం వెంకటాయపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గాజుల బాలకృష్ణ జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఉపాధ్యాయుల్లో ఐసీటీ అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై నైపుణ్యాలను పెంపొందించేందుకు ఎన్ సి ఈ ఆర్ టి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో అక్టోబర్ 14 నుంచి 16 వరకు మూడు రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. దేశంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన 20 మంది అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొననుండగా, వారిలో గాజుల బాలకృష్ణకు అవకాశం లభించడం విశేషం. ఈ శిక్షణలో డిజిటల్ సాధనాల వినియోగం, వినూత్న బోధనా పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధానాలపై అవగాహన కల్పించనున్నారు.

# మన జిల్లా -మన రామగిరి ఖిల్లా ట్రెక్కింగ్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి




రామగిరి, అక్టోబర్ 13 (మనం న్యూస్): జిల్లాలోని చారిత్రక వారసత్వ సంపద రామగిరి ఖిల్లా ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రకృతి అందాలను ఆస్వాదించడం, అటవీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 'మన జిల్లా -- మన రామగిరి ఖిల్లా' వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.హోఈమంగళవారం పెద్దపల్లిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష 'మన జిల్లా -- మన రామగిరి ఖిల్లా' వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.హోఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, హోఅక్టోబర్ 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు బేగంపేట గ్రామం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు రామగిరి ఖిల్లాను సందర్శించి, అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు చారిత్రక వారసత్వ విశేషాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.హోట్రెక్కింగ్‌లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలిహోఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే ఆసక్తిగల వారు పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.హోఅటవీ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలిహోట్రెక్కింగ్ సమయంలో అటవీ ప్రాంతంలోని చెట్లు, మొక్కలు, ఇతర వృక్షసంపదకు ఎలాంటి నష్టం కలిగించకుండా ప్రకృతిని పరిరక్షించాలని నిర్వాహకులు కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ బాధ్యతతో వ్యవహరిస్తూ అటవీ సంపదను కాపాడేందుకు సహకరించాలని సూచించారు.హోచారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవాలిహోరామగిరి ఖిల్లా వంటి చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, వాటి పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రకృతిని ఆస్వాదిస్తూ చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.హోఈ కార్యక్రమంలో ఏజే పెడల్స్ సైకిల్స్‌కు చెందిన అఖిల్ రెడ్డి, లెంకల మహిపాల్ రెడ్డి (మాజీ సైనికుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు), పెద్దపల్లి యువశక్తి సోషల్ మీడియా ప్రతినిధి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వట్టిమల్లలో అన్నపూర్ణ దేవిగా దుర్గామాత దర్శనం



మనం, కోనరావుపేట 13 ; అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు. రాజన్న సిరిసిల్ల జిల్లా,కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల గ్రామంలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో మూడో రోజు సందర్భంగా అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించగా, దాదాపు 500 మంది గ్రామ ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కోనరావుపేట మండల ఫాక్స్ చైర్మన్ చేపూరి గంగాధర్ ,డైరెక్టర్లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండల,గ్రామ ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండి రైతన్నలు సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత ఆలయ చైర్మన్ జవ్వాజి తిరుపతి, గ్రామ సర్పంచ్ గుండా వెంకటేష్, ఉపసర్పంచ్ గంగారం సంపత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్రె శంకర్, గ్రామ ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు సుందరగిరి విద్యార్థుల ఎంపిక

చిగురుమామిడి, అక్టోబర్ 13 (మనం న్యూస్):సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులో ఈ నెల 14 నుండి 16 వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి కుస్తీ క్రీడా పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుందరగిరి నుండి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. 80 కిలోల విభాగంలో ఈ. మల్లికార్జున్, 46 కిలోల విభాగంలో జె. అస్మిత, 57 కిలోల విభాగంలో కె. వర్షిణి, 69 కిలోల విభాగంలో ఈ. తేజశ్రీ, 73 కిలోల విభాగంలో ఈ. మేఘవర్షిత రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు శ్రీమతి వి. పావని, వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీమతి ఎస్.కె. సఫియా, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎంపికైన విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు



# ఎంపీఓగా మహేశ్వర్ బాధ్యతల స్వీకరణ



రాయికల్, అక్టోబర్ 13 (మనం న్యూస్) : రాయికల్ మండల ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపీఓగా మహేశ్వర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్గా డిప్యుటేషన్పై వెళ్లిన సుష్మ స్థానంలో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం మల్లాపూర్ మండల ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఈ అదనపు బాధ్యతలు కేటాయించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి చిరంజీవి తెలిపారు.

# TOSS SSC, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

పెద్దపల్లి, అక్టోబర్-13: మనం న్యూస్ : జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ , సెకండ్ స్కూల్ సర్టిఫికెట్ , ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం రోజున జిల్లాలోని 02 కేంద్రాలలో యూూ ౹ూజ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ పరీక్షలలో ఉదయం 10వ తరగతి పరీక్షలకు గాను 37 మంది అభ్యర్థులకు 29 మంది (78%) హాజరయ్యారని, అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలకు 59 మంది అభ్యర్థులకు గాను 50 మంది (85%) హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పదతరగతి పరీక్షకు (2) ఇద్దరు అభ్యర్థులకు గాను(1) మంది అభ్యర్థులు (50%) హాజరయ్యారు. ఇట్టి పరీక్షకు సంబంధించి ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అప్పుల బాధతో రైతు మృతి

గొల్లపెల్లి అక్టోబర్ 13 (మనం న్యూస్) : గొల్లపల్లి మండలం రంగదామునిపల్లి గ్రామానికి చెందిన నర్రా రాజిరెడ్డి, తండ్రి మల్లారెడ్డి, వయస్సు 55 సంవత్సరాలు (గుడేటి కాపు) గల వ్యక్తి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండే వాడు. గత కొంత కాలం నుండి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఉండేవాడు. వ్యవసాయం మరియు ఇతర అవసరాలకు అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందుల ఇంకా పెరిగి అప్పుల బాధ తాళలేక ఈరోజు ఉదయం సుమారు 10:00 గంటల సమయంలో తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే గొల్లపల్లి పోలీస్ లు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేశారు. మృతుని భార్య నర్రా మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటనతో రంగదాముని పల్లి గ్రామంలో విషాద ఛాయలు ఏర్పడ్డాయి.



# ఓబులపూర్ తండా గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి 20 లక్షల మంజూరు







మల్లాపూర్ అక్టోబర్, 13(మనం న్యూస్)మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ తాండ గ్రామ పంచాయతికి నూతన భవన నిర్మాణానికి వి బిజీ రామ్ జి నిధుల కింద 20 లక్షల రూపాయలు వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ కోరుట్ల నియోజక వర్గ ఇంచార్జి శ్రీ జువ్వాడి నర్సింగ రావు ద్వారా మంజూరి అయినయని ఓబులాపూర్ తాండ పెద్ద మనుషులు, అధ్యక్షులు భూక్య వసూరామ్ నాయక్, భూక్య రవి నాయక్, భూక్య ఆనంద్, విజేందర్ లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వసూరామ్ నాయక్, రవి నాయక్ మాట్లాడుతూ గత బి ఆర్.స్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించిన హయంలో పలు మార్లు తాండ అభివృద్ధికి ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన చీత్తు కాగితాల రూపకంగానే మిగిలిపొగ గిరిజనులు ఓట్లతో లబ్ది పొంది సర్పంచ్,ఎంపిటీసి, ఎంపిపి, ఎమ్మెల్యే లాంటి పదవి పొంది రాజా భోగం అనుభవించారాని తాండ అభివృద్ధి మాత్రం గాలికి వదిలేసి పేరుకు మాత్రం గ్రామ పంచాయతీ అని బోర్డుకె పరిమితం చేసారని తెలిపారు. అలాగే గత పాలకులు బస్టాండ్ నుండి తాండ వరకు వేసిన బిటీ రోడ్డు నాసిరకంగా వేశారని వేసిన మూడో రోజే రోడ్డు పాడైందని తాండ వాసులు కాంట్రాక్టర్ ను నీలాదియగా మళ్ళీ వేయిస్తానని చెప్పి తప్పించుకున్నారని అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ హయం లో కట్టించిన వాటర్ ట్యాంక్ ను బి.ఆర్.స్ ప్రభుత్వ హయంలో మిషన్భగీరథ కింద కట్టినట్టు బి.ఆర్.స్ నాయకులు చెప్పుకుంటున్నారని తెలిపారు. తండా గ్రామ పెద్దలు కాంగ్రెస్ సీనియర్ నాయకులు భూక్యా వసూరామ్ నాయక్,అధ్యక్షులు తాజా మాజీ సర్పంచ్ భూక్యా రవి నాయక్,నాయకులు గుగులవాత్ మోహన్ ,భూక్యా విజేందర్ భూక్యా ఆనంద్ ఆధ్వర్యంలో తాండ నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కొరకు జువ్వాడి నర్సింగరావు కు వినతి పత్రం ఇవ్వగానే వెంటనే పంచాయతీ రాజ్ శాఖ మంత్రి వర్యులు సీతక్క తో మాట్లాడి వెంటనే 20 లక్షలు రూపాయలు వి బిజీ రామ్ జి నిధులకింద మంజూరి చేయించిన అభివృద్ధి ప్రధాత వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు మరియు జిల్లా కిసాన్ సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలాల జలపతి రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్లా సోమయ్య గార్లకు ఓబులపూర్ తండా గ్రామ ప్రజల తరపున ధన్యవాదా లు తెలిపారు.

# ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరికలు



పెద్దపల్లి అక్టోబర్ 13 మనం న్యూస్ : పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన మహిళలు య-ువకులు మంగళవారం రోజున ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు సందర్భంగా . ఖ శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పెద్దపల్లి జిల్లాలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ బలపతం కోసం అన్ని గ్రామాలు కమిటీలు నియామకం చేసి పార్టీని బలపదం చేస్తామని అన్నారు ప్రజలందరికీ అందుబాటులో ఉండి అందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు బీసీల కోసం ఏకైక పార్టీ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అని పేర్కొన్నారు

# అన్నపూర్ణా దేవి స్వరూపంలో దుర్గాదేవి




రాయికల్, అక్టోబర్ 13(మనం న్యూస్) : శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాయికల్ మండలం బోర్నపెల్లి, చింతలూరు ఒడ్డెలింగాపూర్ తదితర గ్రామాల్లో నెలకొల్పిన దుర్గా దేవి మండపాల్లో మంగళవారం

అందరికీ ఆహారం అందించే తల్లి అన్నపూర్ణా దేవి స్వరూపంగా దుర్గామాత ప్రత్యేక పూజలు పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ పూజా కార్యక్రమాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఎలోనినో ప్రభావం తో ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితులు దేవి కృపతో తొలగిపోయి సుఖసంతోషాలు చేకూరాలని భక్తులు ఆకాంక్షించారు. ఆయా గ్రామాల్లో విగ్రహాదాతలు తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో దుర్గా భవాని సేవా సమితి సభ్యులు,నవదుర్గా సమితి సభ్యులు అంబేద్కర్ సంఘం సభ్యులు,భవానీ దీక్ష స్వాములు,మహిళలు భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

**-రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి**




పెద్దపల్లి అక్టోబర్ 13: మనం న్యూస్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఐడీఓసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ, బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి, ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

**బతుకమ్మ పాటల ద్వారా సూపర్ ఎల్‌నినోపై అవగాహన కల్పించాలి**

ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన సందేశాలతో పాటలు రూపొందించేలా ప్రజలను, మహిళా సంఘాలను, యువతను ప్రోత్సహించాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించే వేదికగా కూడా వినియోగించుకోవాలని సూచించారు.

**పర్యాటక అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**రెండు వారాల్లోగా డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి**

పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధి, భూమి లభ్యత, నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్‌లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

**హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో చర్యలు**

కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎ. వాణీ ప్రసాద్ తెలిపారు. ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులను పూర్తి చేసి, నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఇటువంటి ప్రాజెక్టులకు ఆసక్తి చూపే ప్రైవేట్ పెట్టుబడిదారులు ఉంటే, జిల్లా స్థాయిలో వారిని గుర్తించి ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

**నిధుల వనరులను పరిశీలించి పర్యాటక ప్రణాళిక రూపొందించాలి**

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, అమలు విధానం, పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా స్వదేశ్ దర్శన్ పర్యాటక అభివృద్ధి కార్యక్రమం కింద జిల్లాకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి, నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రాజశేఖర్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# సిరిసిల్ల జిల్లాలో మెడికల్ షాపుల ఇష్టారాజ్యం!

**ప్రజల ప్రాణాలతో చెలగాటమా?.**

**గడువ ముగిసిన మందులు కయ విక్రయాలు అని ఆరోపణలు.**

**మందుల దుకాణాలపై అధికారుల నిఘా ఏది?.లితనిఖీలు ఎక్కడ? చర్యలు ఎప్పుడు?.**



సిరిసిల్ల అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) : ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన మందుల దుకాణాలే నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయనే ఆరోపణలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని మెడికల్ షాపుల్లో ఇష్టానుసారంగా మందుల విక్రయాలు జరుగుతున్నాయని, గడువు ముగిసిన మందులు సైతం విక్రయిస్తున్నారు. అని బహిరంగంగా చర్చ జరుగుతోంది. ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అనారోగ్యంతో మందుల కోసం దుకాణాలకు వెళ్లే సామాన్య ప్రజలు ఇలాంటి పరిస్థితుల వల్ల నష్టపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**మెడికల్ షాపుల్లో గడువు ముగిసిన మందుల విక్రయాలు జరుగుతున్నాయా?.**

మందులపై ముద్రించిన గడువు తేదీని పరిశీలించకుండా కొనుగోలు చేస్తే ప్రజలు ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది. గడువు ముగిసిన మందులను విక్రయించడం చట్టపరంగా తీవ్రమైన ఉల్లంఘన. అలాంటి మందులు ప్రజలకు విక్రయిస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేస్తున్నారా లేదా లోపాయకార ఒప్పందాలు మెడికల్ షాపులతో చేసుకున్నారా అన్న అనుమానాలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి. తనిఖీలు చేస్తే ఎప్పుడు ఎక్కడ చేస్తున్నారు అన్న అనుమానాలు కూడా ఉన్నాయని ప్రజలు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. కొన్ని మెడికల్ షాపుల్లో గడువు ముగిసిన మందుల విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు నిజమైతే, అది ప్రజారోగ్యానికి సంబంధించిన తీవ్రమైన సమస్య. ఈ వ్యవహారంపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి.

**అధికారులు ఏం చేస్తున్నట్లు?.**

జిల్లాలో మెడికల్ షాపుల నిర్వహణపై పర్యవేక్షణ బాధ్యత సంబంధిత ఔషధ నియంత్రణ అధికారులపై ఉంది. మందుల నిల్వలు, గడువు తేదీలు, విక్రయ రికార్డులు, లైసెన్సులు వంటి అంశాలను తనిఖీ చేయాల్సిన అధికారులు ఈ ఆరోపణలపై స్పందిస్తున్నారా? నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై ఎన్ని చర్యలు తీసుకున్నారు? ప్రజలకు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలకు సంబంధించి వాస్తవాలను నిర్ధారించడం కూడా అంతే ముఖ్యం. తనిఖీల వివరాలు, నమోదైన కేసులు, తీసుకున్న చర్యలను అధికారులు బహిర్గతం చేయాలి.

**ప్రజల జేబులకు చిల్లు.. ఆరోగ్యానికి ముప్పు!.**

సామాన్య ప్రజలు తమ ఆరోగ్య సమస్యలకు పరిష్కారం కోసం మందులు కొనుగోలు చేస్తారు. మందుల నాణ్యత, గడువు తేదీ, ధరల విషయంలో మోసపోతే ఆర్థిక నష్టంతో పాటు ఆరోగ్యపరమైన ప్రమాదాలు కూడా ఎదురవుతాయి. మందుల గడువు తేదీలను పట్టించుకోకుండా విక్రయాలు జరిగితే అటువంటి దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసే ప్రతి మందుకు బిల్లు ఇవ్వడం, గడువు తేదీని పరిశీలించడం, నిబంధనలకు అనుగుణంగా మందులను నిల్వ చేయడం తప్పనిసరిగా అమలయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

**ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారా?.**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మెడికల్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్నారనే ఆరోపణలను విచారించాలని ప్రజలు కోరుతున్నారు. తప్పు చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, తనిఖీల ఫలితాలను ప్రజలకు తెలియజేయాలి. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యంతో ముడిపడిన ఈ అంశంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే స్పందించాలి. మందుల విక్రయాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, ప్రజలకు సురక్షితమైన మందులు అందేలా చూడాలి. ప్రజారోగ్య పరిరక్షణలో రాజీ పడకుండా సంబంధిత శాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అని ప్రజలు భావిస్తున్నారు. మెడికల్ షాపులపై సంబంధిత అధికారులు తనిఖీ చేయలేకపోతే జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు జిల్లా కలెక్టర్కు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పెద్దపల్లిలో ఘనంగా జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

పెద్దపల్లి, అక్టోబర్ 13: మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాన్ని నడిపించడమే కాకుండా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పెద్దపల్లి జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, దేశంలో ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చినప్పటికీ ఒకవైపు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, మరోవైపు తక్కువ కాలంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ ఏర్పడే నాటికి 7,778 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ సామర్థ్యాన్ని దాదాపు 20 వేల మెగావాట్ల స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులు తిరిగి సాగునీరు, విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. వేసంగి పంటలు వేయవద్దని మంత్రులు సూచించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. పెద్దపల్లి రైతుల అవసరాల కోసం గత ప్రభుత్వం రాళ్లపల్లి వద్ద వరద కాలువ నుంచి కాకతీయ కాలువకు లింక్ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం 1,100 క్యూసెక్కుల నీరు అవసరముండగా కేవలం 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారని, ఎస్సారెస్పీ కాల్వలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, పంటల బోనస్, ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

**ప్రజలకు పాలనను చేరువ చేసిన ఘనత కేసీఆర్‌దే: కోరుకంటి చందర్**

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాళేశ్వరం వంటి దూర ప్రాంతాల ప్రజలు కలెక్టర్‌ను కలవాలంటే దాదాపు 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేసీఆర్ చిన్న జిల్లాలను ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన 129 సంక్షేమ పథకాలు మానవీయ కోణంతో రూపొందించినవేనని, వృద్ధులకు రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2,000కు పెంచి ఆర్థిక భరోసా కల్పించారని కొనియాడారు. పేదలు, వృద్ధులు, నిరుపేద కుటుంబాల సంక్షేమానికి కేసీఆర్ పాలన ప్రత్యేక ప్రాధాన్యం





ఇచ్చిందన్నారు.

**పెద్దపల్లి అభివృద్ధికి కేసీఆర్, దాసరి మనోహర్ రెడ్డి విశేష కృషి: దాసరి మమతారెడ్డి**

పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకొని కేసీఆర్ జిల్లాల పునర్విభజన చేపట్టారని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఏర్పాటుతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, మాతా శిశు సంరక్షణ కేంద్రం, డయాలసిస్ యూనిట్, టీ-డయాగ్నోస్టిక్స్ వంటి వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. నాటి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కృషితో పట్టణంలో విశాలమైన రహదారులు, సెంట్రల్ లైటింగ్ వంటి అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కేసీఆర్ కిట్ వంటి పథకాలను ఎందుకు కొనసాగించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి: చిరుమల్ల రాకేష్**

టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. మహిళా కళాశాల భవనాలు, కూనారం బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందని, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందక మోటార్లు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకొని పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**బతుకమ్మ సంబరాలు, ఒగ్గుడోలు నృత్యాలతో ఘనంగా జిల్లా దశాబ్ది ఉత్సవాలు**

పెద్దపల్లి జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా



నిర్వహించారు. ముందుగా అయ్యప్ప టెంపుల్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి, అనంతరం బస్టాండ్ చౌరస్తా వద్ద డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు పెద్దపల్లి జిల్లా ఏర్పాటులో ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దాసరి మమతారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు రంగురంగుల బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. మహిళల ఆటపాటలతో ఉత్సవ ప్రాంగణం సందడిగా మారింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒగ్గుడోలు కళాబృందం కళాకారులు డోలు వాయిద్యాలు, ఉత్సాహభరితమైన నృత్య ప్రదర్శనలతో అందరినీ అలరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాగిన ఈ ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఠాకూర్ రఘువీర్ సింగ్, ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

**రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్**

**హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

సిరిసిల్ల, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఐడీఓసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ.. బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి, ప్రచారం చేయాలని కలెక్టర్లకు




సూచించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బతుకమ్మ పండుగ కోసం మహిళలు ఆడే చోట లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నీటి వనరుల వద్ద బారికేడింగ్ పెట్టాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాస్థాయి బతుకమ్మ వేడుకలు అన్ని శాఖలు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, డీటీసీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.